



ఎమ్మెస్సీ సెంటర్ ప్రారంభోత్సవంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

మహిళా సాధికారతే మా లక్ష్యం

- సీఎం స్టాలిన్
- సైదాపేటలో ఎమ్మెస్సీ సెంటర్ ప్రారంభం

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళలంతా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా డీఎంకే ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మహిళలు ఆత్మస్థైర్యంతో స్వయం సంపాదనతో రాణించాలన్నదే డీఎంకే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. సైదాపేటలో మహిళల కోసం ప్రతిభాపాటవాల అభివృద్ధి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా కలైంజర్ కంప్యూటర్ సెంటర్‌లో టాలీ, ఎంఎస్ ఆఫీస్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి వేయిమందికి పైగా మహిళలు హాజరుకావటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. నలుగురు మహిళలు కలిస్తే ఆ ప్రాంతంలో సందడిగా ఉంటుందని, అయితే తన సభకు విచ్చేసిన వారంతా ప్రశాంతంగా ఉండటం చూస్తుంటే తనకు సంతోషంగా ఉందన్నారు. ఆంగ్ల సంవత్సరాదికి ముందు పుదుమై పెణ్ పథకం విస్తరణ కార్యక్రమంలో పాల్గొన్నానని, సంవత్సరాది తర్వాత మహిళలకు ప్రతిభాపాటవాలపై శిక్షణ ఇచ్చే సభలో పాల్గొంటున్నానని చెప్పారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడల్లా మహిళా సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలయ్యాయని, వాటిలో ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్, ఆస్తిలో సగం వాటా, మహిళా స్వయం సహాయక సంఘాలు, పుదుమై పెణ్ పథకం, కలైంజర్ సాధికారిక నగదు వంటి సంక్షేమ పథకాలు కీలకమైనవని చెప్పారు. ఆ కోవలోనే పార్టీపరంగా మంత్రి సుబ్రమణ్యం సైదాపేటలో ఈ ఎమ్మెస్సీ సెంటర్ ప్రారంభించారని, నేచురల్స్, ఉషా సంస్థ సహకారంతో ఈ ప్రతిభాపాటవాల అభివృద్ధి కేంద్రంలో మహిళలకు మేలు చేకూర్చుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్, ద్రావిడ ఇయక్క తమిళ్‌పేరవై అధ్యక్షులు శుభ వీరపాండ్యన్, ఎమ్మెల్యేలు అరవింద్ రమేష్, తాయగం కవి, ప్రభాకర్ రాజా, గణపతి, హసన్ మౌలానా, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, కార్పొరేషన్ జోనల్ కమిటీ అధ్యక్షులు కృష్ణమూర్తి, దురైరాజ్, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగులకు పొంగల్ బోనస్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పొంగల్ బోనస్ ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్.. ఇందుకోసం రూ.163.81 కోట్లు కేటాయించారు. ఈ మేరకు సచివాలయం గురువారం విడుదల చేసిన ప్రకటన చేసింది. ఆ ప్రకారం, 'సి', 'డి' విభాగాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు గరిష్ఠంగా రూ.3,000 అందుకోనున్నారు. ప్రత్యేక కాల నిర్ణయ వేతనం కింద పని చేసే ఉద్యోగులు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 240 రోజులు, ఆపై నెలవారీ వేతనం కింద పనిచేస్తున్న ఉద్యోగులు, శాశ్వత, తాత్కాలిక వేతన ఉద్యోగులు రూ.1,000 బోనస్ అందుకోనున్నారు. ఇక, 'సి', 'డి' విభాగాలకు చెందిన పింఛన్‌దారులు, కుటుంబ పింఛన్‌దారులు, మాజీ గ్రామ అధికారులు, వ్యక్తిగత పింఛన్‌దారులు రూ.500 బోనస్ అందుకోనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

క్రీడా అవార్డు గ్రహీతలకు స్టాలిన్ శుభాకాంక్షలు

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నుంచి క్రీడా అవార్డులను అందుకున్న రాష్ట్రానికి చెందిన క్రీడాకారులకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ మేరకు తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం కూడా పొందుపరిచారు. ఖేల్‌రత్న అవార్డు పొందిన గుకేష్, అర్జున అవార్డు పొందిన తులసిమది, నిత్యశ్రీ, మనిషా రాందాస్, అభయ్‌సింగ్ తదితరులకు ఆయన అభినందనలు తెలిపారు.

పాఠశాలలు పునఃప్రారంభం

- తొలిరోజే సెమిస్టర్ పుస్తకాల పంపిణీ



సెమిస్టర్ పుస్తకాలందుకున్న విద్యార్థులు

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అర్ధ వార్షిక సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజే మూడో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందజేశారు. రాష్ట్ర పాఠ్యప్రణాళికలో అన్ని రకాల పాఠశాలల్లో అర్ధవార్షిక, రెండో సెమిస్టర్ పరీక్షలు గత నెల 9 నుంచి 23వ తేది వరకు నిర్వహించారు. అనంతరం 24వ తేది నుంచి ఈ నెల 1వ తేది వరకు సెలవులు ప్రకటించారు. సెలవుల అనంతరం గురువారం నుంచి పాఠశాలలు ప్రారంభమయ్యాయి.

లారీని ఢీకొన్న అంబులెన్స్

- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతి



ఘటనలో ధ్వంసమైన అంబులెన్స్

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం సమీపంలో లారీని వెనుక నుంచి అంబులెన్స్ ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. వివరాలిలా... రామనాథపురం జిల్లా మరక్కాయర్‌పట్టికి చెందిన వారిసైకని (65) అస్వస్థతకు గురికావడంతో అంబులెన్స్‌లో రామనాథపురంలోని ఆస్పత్రి తీసుకెళ్తున్నారు. రోగి వెంట కుమార్తె ఆనీస్‌ఫాతిమా (40), కోడలు సకుబర్‌సాధిక్ (47), హర్షద్ (45), ఖజీనారాణి (40), ఆయిషాబేగం (35) తదితరులు కూడా అంబులెన్స్‌లో ఉన్నారు. మదురై-రామేశ్వరం జాతీయ రహదారి వాలాందరపై ప్రాంతంలో ఓ పెట్రోల్ బంక్‌లో నుంచి లారీ రోడ్డు పైకి వస్తుండగా అంబులెన్స్ లారీ వెనుక భాగాన్ని బలంగా ఢీకొంది. అంబులెన్స్ వెనుకగా వస్తున్న ఆమ్నీ బస్సు, కారు కూడా ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో అంబులెన్స్‌లో ప్రయాణిస్తూ తీవ్రగాయాలైన వారిసైకని, సకుబర్‌సాధిక్, ఆనీస్‌ఫాతిమా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందారు. క్షతగాత్రులను రామనాథపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించిన కేనిక్కరై పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.





పుష్ప ప్రదర్శన ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ - ప్రదర్శనలో పుష్పాలంకరణ

సెమ్మొళి పార్క్‌లో పుష్ప ప్రదర్శన



చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాథిడ్రల్ రోడ్డులో వున్న సెమ్మొళి పార్కులో పుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. ఈ పార్కులో ఏర్పాటైన 4వ పుష్ప ప్రదర్శనను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. నగర ప్రజలను ఆకట్టుకొనేలా 2022 నుంచి నగరంలో పుష్ప ప్రదర్శన ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు పుష్ప ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.

నాలుగో ప్రదర్శనలో విశేషాలు...

ప్రస్తుతం నాలుగో పుష్ప ప్రదర్శనను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఇందులో పెటునియా, సాల్వియా, సెంటిపోలియా, రోజ్, అంతురియం, పెంటాస్ సహా 50 రకాల పూలతో ఏనుగు, సీతాకోక చిలుక, రైలు, పడవ ఇలా పలు నమూనాలు ఏర్పాటుచేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు దురైమురుగన్, ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, పీకే శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ప్రియ, ఎంపీలు దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, ఎమ్మెల్యేలు టి.వేలు, ఎన్.ఎళిలన్, జీసీసీ డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం తదితరులున్నారు. ఈ ప్రదర్శన ప్రారంభించిన సీఎం, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులతో కలసి గ్రూప్ ఫొటో దిగారు.

ప్రవేశ రుసుము రూ.200...

ఈ పుష్ప ప్రదర్శన తిలకిందుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.100 రుసుముగా నిర్ణయించారు. ఉదయం 10 నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శన తిలకించవచ్చు. గురువారం నుంచి ఈ నెల 18వ తేది వరకు జరుగనున్న ఈ ప్రదర్శనకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు టిక్కెట్లు విక్రయించనున్నారు. అలాగే, https://tnhorticulture.in/spetickets/ అనే వెబ్‌సైట్ ద్వారా కూడా టిక్కెట్లు పొందవచ్చని అధికారులు తెలిపారు.

మన్మోహన్ చిత్ర పటాన్ని ఆవిష్కరించనున్న సీఎం

అడయార్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన మాజీ ప్రధాని దివంగత డాక్టర్ మన్మోహన్ సింగ్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు, ఈరోడ్ ఈస్ట్ సిట్టింగ్ ఎమ్మెల్యే దివంగత ఈవీకేఎస్ ఇళంగోవన్ చిత్ర పటాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆవిష్కరించనున్నారు. ఈ నెల 7వ తేదీ అన్నాసాలైలోని కామరాజర్ అరంగంలో జరిగే కార్యక్రమంలో ఆయన పాల్గొని ఈ చిత్ర పటాలను ఆవిష్కరిస్తారని టీఎన్‌సీసీ వర్గాలు వెల్లడించాయి.

అత్యాచార ఘటనపైనా రాజకీయాలేనా?

- ప్రచారం కోసమే మీ అవస్థలు
- హైకోర్టు ఆగ్రహం
- పీఎంకే ఆందోళనకు అనుమతి నిరాకరణ
- అయినా నిరసనకు దిగిన పీఎంకే నేతల అరెస్టు



అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ నినాదం చేస్తున్న సౌమ్యా అన్బుమణి



కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మహిళలకు భద్రత కల్పించడంపై దృష్టి పెట్టకుండా అత్యాచార ఘటనపై కుటిల రాజకీయాలేంటని మద్రాస్ హైకోర్టు రాజకీయ పార్టీలను నిలదీసింది. ఆందోళన చేసే నేతలు, కార్యకర్తలు నిజంగా తాము మహిళలకు భద్రత కల్పిస్తున్నామా అని తమను తాము ప్రశ్నించుకోవాలని సూచించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేల్‌మురుగన్ నేతృత్వంలోని ధర్మాసనం కటువుగా వ్యాఖ్యానించింది. అన్నా విశ్వవిద్యాలయం అత్యాచార సంఘటనకు డీఎంకే ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణే కారణమని ఆరోపిస్తూ పీఎంకే మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించ తలపెట్టిన ధర్నాకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో ఆ పార్టీ న్యాయవాది బాలు మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ వేల్‌మురుగన్.. అన్నా విశ్వవిద్యాలయం వ్యవహారాన్ని ఎందుకు రాజకీయం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఘటన వల్ల బాధ్యతాయుతమైన పౌరులంతా సిగ్గుతో తలవంచుకోవాల్సి ఉందన్నారు. ఈ వ్యవహారాన్ని హైకోర్టు సుమోటాగా స్వీకరించడమే కాకుండా ముగ్గురు మహిళా ఐపీఎస్‌లతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని కూడా ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్ర పోలీసుశాఖ కూడా విచారణ జరుపుతోందని, అలాంటప్పుడు ఈ వ్యవహారాన్ని రాజకీయం చేయడం భావ్యమేనా అని నిలదీశారు. పీఎంకే నేతలు ప్రచారార్భాటం కోసమే ఆందోళనకు పిలుపునిచ్చినట్లుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ప్రసారమాధ్యమాలు ప్రత్యేకించి పత్రికలు గోరంతలు కొండంతలుగా వివాదాస్పద వార్తలు ప్రచురించడం కూడా తమకు తీవ్ర ఆవేదన కలిగిస్తోందంటూ పీఎంకే మహిళా విభాగం నిర్వహించే ఆందోళనకు అనుమతించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చారు.

పీఎంకే మహిళా విభాగం ధర్నా, అరెస్టు...

అన్నా వర్సిటీలో అత్యాచార సంఘటనను ఖండిస్తూ పీఎంకే మహిళా విభాగం, పసుమైతాయగం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం పోలీసుల అనుమతి లేకుండా ధర్నా నిర్వహించారు. దీంతో ధర్నాకు నాయకత్వం వహించిన పసుమైతాయగం అధ్యక్షురాలు సౌమ్యా అన్బుమణి సహా సుమారు వందమంది మహిళా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి తరలించారు. పోలీసుల వైఫల్యం వల్లే అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై అత్యాచారం జరిగిందంటూ కార్యకర్తలంతా పోలీసులతో వాగ్వివాదానికి పాల్పడ్డారు.

అన్బుమణి ఖండన...

అత్యాచారానికి విద్యార్థినికి న్యాయం జరగాలని, నిందితులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్‌తో ధర్నా చేసేందుకు ప్రయత్నించిన పసుమై తాయగం నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం గర్హనీయమని పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఖండించారు.

సమాచార దర్శిని

10న మారథాన్ పోటీలు

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేది ఉదయం మారథాన్ పోటీలు నిర్వహించనున్నారు. మారథాన్ పోటీలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదుచేసుకోవచ్చు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై స్మారకార్థం నిర్వహించే మారథాన్ స్వామి వివేకానంద రోడ్డు నుంచి ప్రారంభమై నేపియర్ బ్రిడ్జి, ఐల్యాండ్ గ్రౌండ్స్, ఖాయిదేమిల్లత్ బ్రిడ్జి, అన్నాసాలై మార్గంగా మళ్లీ వివేకానంద రోడ్డు చేరుకుంటుంది. 17-25 ఏళ్ల పురుషులకు 5,8 కి.మీ, 25 ఏళ్ల పైబడిన వారికి 10.5 కి.మీ పోటీలు జరుగనున్నాయి. విజేతలకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, నాలుగు నుంచి 10వ స్థానంలో నిలిచిన వారికి తలా రూ.1,000 నగదు, ప్రసంశాపత్రం అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు 7401703480 అనే నెంబరు సంప్రదించి పేరు నమోదుచేసుకోవాలని ప్రకటనలో తెలియజేశారు.

మెట్రోలో 10.52 కోట్ల మంది ప్రయాణం

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో నడుస్తున్న మెట్రోరైళ్లలో గత ఏడాది (2024) 10.52 కోట్ల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) విడుదల చేసిన ప్రకటనలో.. నగరంలో మెట్రోరైళ్లు ప్రారంభించిన 2015 జూన్ 29 నుంచి 2024 డిసెంబరు 31వ తేది వరకు 35,53,60,793 మంది ప్రయాణించారు. 2023లో 9,11,02,957 మంది ప్రయాణించగా, 2024లో 10,52,43,721 మంది ప్రయాణించారు. మెట్రో ప్రయాణికులకు మరిన్ని సేవలందించేలా క్యూఆర్ కోడ్, ట్రావెల్ కార్డ్, పేటీఎం, ఫోన్ పే ద్వారా టిక్కెట్లు పొందడంతో పాటు 20 శాతం రాయితీ కూడా అందిస్తున్నారు. అలాగే, +91 830008600 అనే వాట్సాప్ నెంబరు ద్వారా టిక్కెట్లు పొందే సదుపాయం కల్పించినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

రూ.14.50 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్,జనవరి2(ఆంధ్రజ్యోతి): వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.14.50 తగ్గింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుగుణంగా ఆయిల్ సంస్థ లు ప్రతినెలా సిలిండర్ ధరల్లో మార్పులు చేపడుతుంటాయి. గతనెల 19కిలోల వాణిజ్య సిలిండర్‌ధర రూ.16 పెరగడంతో రూ.1,980.50కు విక్రయమవుతోంది. గత మూడేళ్లుగా వాణిజ్య సిలిండర్ ధర పెరుగుతున్న నేపథ్యంలో, ఈ నెల తగ్గడం గమనార్హం.

32 జిల్లాల్లో పెరిగిన భూగర్భ జలమట్టాలు

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 32 జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయని ప్రభుత్వ పరిశోధనల్లో తెలిసింది. ఈ మేరకు భూగర్భ, ఉపరితల జల వనరుల పరిశోధన కేంద్రం చేపట్టిన పరిశోధనల్లో... నవంబరుతో పోల్చితే డిసెంబరులో కోవై, నీలగిరి, మదురై, విరుదునగర్, కన్నియాకుమారి జిల్లాల్లో మాత్రం భూగర్భ జలమట్టాలు తగ్గగా, మిగిలిన జిల్లాల్లో పెరిగాయి. తిరువళ్లూర్ జిల్లాలో 1.67 మీటర్లు, కాంచీపురంలో 1.03, చెంగల్పట్టులో 1.20 మీటర్లు భూగర్భ జలమట్టాలు పెరిగాయి. నీలగిరి జిల్లాలో 0.06 మీటర్లు, కోవైలో 0.04, మదురైలో 0.13, విరుదునగర్‌లో 0.13, కన్నియాకుమారిలో 1.03 మీటర్ల మేర భూగర్భ జలమట్టాలు తగ్గాయని అధికారులు తెలిపారు.

త్వరలో తంజై తమిళ వర్సిటీ సిండికేట్ సమావేశం

ఐసిఎఫ్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): తంజావూరు తమిళ్ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి శంకర్, రిజిస్ట్రార్ త్యాగరాజన్ మధ్య వివాదం నెలకొంది. ఇద్దరు ఒకరినొకరిని తొలగిస్తూ సర్క్యులర్ జారీ చేయడం కలకలం రేపింది. కొత్త రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ వెట్రిసెల్వన్ బాధ్యతలు చేపట్టే సమయంలో, రిజిస్ట్రార్ గదికి త్యాగరాజన్ తాళాలు వేయడం, తాళాలు బద్దలుకొట్టి వెట్రిసెల్వన్ బాధ్యతలు చేపట్టడం తెలిసిన విషయమే. ఈ నేపథ్యంలో, తమిళ్ వర్సిటీ సిండికేట్ సమావేశం వచ్చే వారం చెన్నైలో జరుగనున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. ఈ సమావేశంలో వర్సిటీలో నెలకొన్న సమస్యలు చర్చించనున్నట్లు సమాచారం.

జీసీసీ పరిధిలో 35 శాతం వృత్తి పన్ను పెంపు

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 35 శాతం వృత్తి పన్ను పెంపు ఈ నెల నుంచి అమలుకు వచ్చింది. జీసీసీకి గత 2023-24వ ఆర్థిక సంవత్సరంలో రూ.532 కోట్ల వృత్తి పన్ను లభించింది. ఏడాదిలో రెండు సార్లు (ఆరు నెలలకు ఒకసారి) వృత్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆరు నెలల ఆదాయం రూ.21 వేలు పొందే వారికి వృత్తి పన్ను నుంచి మినహాయింపు కల్పించారు. ఈ నేపథ్యంలో, వృత్తి పన్ను ప్రస్తుతం 35 శాతం పెంచారు. ఆ ప్రకారం, రూ.21 వేల నుంచి రూ.30 వేలు ఆదాయం పొందుతున్న వారు చెల్లిస్తున్న వృత్తి పన్ను రూ.135 నుంచి రూ.180కి పెరిగింది. రూ.30,001 నుంచి రూ.45 వేల ఆదాయం పొందే వారు చెల్లిస్తున్న రూ.315 వృత్తి పన్ను రూ.425కు పెరిగింది. ఆ ప్రకారం, ఏడాదికి రూ.630 చెల్లిస్తున్న వారు ఇక నుంచి రూ.850 చెల్లించాల్సి ఉంటుంది. ఇక, రూ.45,001 నుంచి రూ.60 వేలు ఆదాయం ఉన్న చెల్లిస్తున్న వృత్తి పన్ను రూ.690 నుంచి రూ.930, రూ.60,001 నుంచి రూ.75 వేలు, రూ.75 వేలకు పైబడిన వారికి పన్ను పెంచలేదు. ఈ పన్ను పెంపుకు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం ఆమోదం తెలుపడంతో, ప్రస్తుత అర్థవార్షికం నుంచే పన్ను పెంపు అమలుకు వచ్చింది.



పార్కులో సేదతీరుతున్న శునకాలు - దుస్థితిలో నీటి సరస్సు - అలంకారప్రాయంగా వాటర్ ఫౌంటైన్లు

ఏదీ నాటి వైభవం..

నాడు కళకళ.. నేడు వెలవెల

● 'మై లేడీస్ పార్కు'కు పూర్వ వైభవం వచ్చేనా?

టి.నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని రాయపురం జోన్ పెరియమేడు ప్రాంతంలోని 'మై లేడీస్ పార్కు'! అప్పటి మద్రాసు నగరంలో తెలుగు చలనచిత్రాల నిర్మాణం జరుగుతున్నప్పుడు హీరో హీరోయిన్లు చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతూ పాటలు పాడిన అందమైన ఉద్యానవనంగా పేరుంది. 'మైలేడీస్ పార్కు'కు రోజూ చిన్నారుల నుంచి వృద్ధులదాకా, బాలికలు, యువతులు సుమారు 500 మంది వరకు ఉదయం పూట వాకింగ్ కోసం వస్తుంటారు. ఈ పరిస్థితులలో ఈ పార్కు ప్రవేశ ద్వారం నుండి కాలి బాట వరకు వీధి కుక్కల బెడద రోజు రోజుకూ అధికమవుతోంది. నడక దారికి రువైపులా ఉన్న చెట్ల నీడలో, సందర్శకుల కోసం ఉన్న బల్లలపై కూడా కుక్కలు నిద్రపోతున్నాయి. అంతే కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చేవారి వెంటబడి, తరుముతున్నాయి.

అధ్వానంగా వాటర్ ఫౌంటైన్లు...

ఈ పార్కులోని వాటర్ ఫౌంటెన్లు యేడాదికిపైగా పనిచేయడం లేదు. ప్రస్తుతం ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తుండటంతో ఎవరూ దాని దరిదాపులకు వెళ్లటం లేదు. నెలల తరబడి ఆ ఫౌంటైన్‌లో నీరు పాచిపట్టింది. ఆ ప్రాంతంలో పనిచేయకుండా ఉన్న నాలుగు ఫౌంటైన్లకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పెరియమేడు ప్రాంతానికి చెందిన గణేష్ మాట్లాడుతూ ప్రస్తుతం 'మై లేడీస్ పార్కు'లో ఏ మూలకు వెళ్ళినా వీధి కుక్కలు వెంటబడి తరుముతున్నాయని చెప్పారు. ఈ కుక్కల బెడద వల్లే బాలికలు, యువతులు ఆ పార్కుకు రావడానికి జంకుతున్నారని తెలిపారు. వీటన్నింటికి తోడుగా గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ఈ పార్కు దుస్థితిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇక పార్కు అంతటా చెట్ల కొమ్మలు సందర్శకులకు తగిలేంతగా దిగువకు ఉన్నాయని, చెట్ల నుండి రాలిన ఆకులన్నీ ఎండి చెత్తకుప్పలుగా పేరుకుపోయాయనిచెప్పారు. ఇకనైనా కార్పొరేషన్ అధికారులు నగర చరిత్రలో స్థానం కలిగిన ఈ విశిష్టమైన ఉద్యానవనానికి పూర్వ వైభవం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

కోలాహలంగా వీఐఎస్ వార్షికోత్సవం



విజేతలకు బహుమతులందజేస్తున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి సత్యనారాయణన్, వీఐటీ వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీఐఎస్ పాఠశాల తృతీయ వార్షికోత్సవం కోలాహలంగా సాగింది. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ, విద్యార్థులకు పలురకాల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మద్రాసు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎం.సత్యానారాయణన్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వీఐటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం, వీఐఎస్ పాఠశాల డైరెక్టర్ డా.సంజీవి, సలహాదారులు శ్రీనివాసన్, ప్రిన్సిపాల్ ప్రభాకరన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

6 నుంచి మార్గళి సంగీతోత్సవాలు



గాత్ర విద్వాంసులు సుచిత్రాబాల సుబ్రమణ్యం, రిత్విక్‌రాజా

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో ఈ నెల 6న మార్గళి సంగీతోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆస్పత్రి 'ఎ' బ్లాక్ 7వ అంతస్థులో సాయంత్రం 5 నుంచి రాత్రి 7వరకు ఈ సంగీత కార్యక్రమాలు జరుగుతాయి. 6న రిత్విక్‌రాజా గాత్రకచేరీ, 7న వసుధారాణి గ్రాతకచేరీ, 8న విశ్వాస్ హరి మాండలిన్ కచేరీ, 9న వీకే మణిమారన్, 10న సుచిత్రా బాలసుబ్రమణ్యం కృష్ణామృతం కథాకచేరీ జరుగుతాయి. ఈ సంగీత కార్యక్రమాలను వీక్షించాలనుకునేవారు ముందుగా 044-40006000అనే నెంబర్‌కు ఫోన్ చేసి తమ సీట్లను రిజర్వు చేసుకోవాల్సి ఉంటుందని, కార్యక్రమం ముగిశాక అల్పాహారం ఉంటుందని ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.

పర్వతారోహణపై ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ



శిక్షణలో విద్యార్థులు

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కున్నూర్ వెల్లింగ్టన్ ప్రాంతంలో ఉన్న తంగరాజ్ స్మారక మైదానంలో ఎన్‌సీసీ క్యాడెట్లకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణలో కేరళ, లక్షద్వీప్, తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్, కర్ణాటక, ఆంధ్ర, మహారాష్ట్ర తదితర రీజియన్లకు చెందిన 100 మందికి పైగా ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. తమిళనాడు ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సంతోష్‌కుమార్ నేతృత్వంలో నైపుణ్యం, ధైర్యం, శౌర్యం, సమన్వయం తదితరాలు ప్రదర్శించేలా నిర్వహించిన పర్వతారోహణ వ్యాయామ శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

శివకాశిలో రూ.400 కోట్ల మేర క్యాలెండర్ల విక్రయాలు



శివకాశిలోని ఓ క్యాలండర్ విక్రయ దుకాణం

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): శివకాశిలో ఈ ఏడాది క్యాలెండర్ల విక్రయాలు సుమారు రూ.400 కోట్లకు పైగా జరుగడంతో తయారీదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శివకాశిలో బాణసంచా పాటు క్యా లెండర్లను కూడా ప్ర ధానంగా తయారు చేస్తుంటారు. శివకాశి, పరిసర ప్రాంతాల్లో సుమారు 100కి పైగా సంస్థలు క్యాలెండర్లు తయారుచేస్తున్నాయి. అందుకు నాలుగు నెలల ముందు నుంచే తయారీ ప్రారంభించారు. దినసరి, నెల వారీ క్యాలెండర్లు, టేబుల్ క్యాలెండర్లు, ప్యాకెట్ క్యాలెండర్లు అని పలు రకాల క్యాలెండర్లు తయారయ్యాయి. పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 90 శాతానికి పైగా ఆర్డర్లు వచ్చాయి. ప్రస్తుతం మిగిలిన 10 శాతం క్యాలెండర్లను యజమానులు తరలిస్తున్నారు. గత ఏడాదిలాగే ఈ ఏడాది కూడా క్యాలెండర్ల విక్రయాలు జరిగాయి. వచ్చే ఏడాది క్యాలెండర్ తయారీ, ఏప్రిల్‌లో తమిళ సంవత్సరాదిని పురస్కరించుకొని తమిళ పంచాంగం విడుదలతో ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు.

తిరుచెందూరు ఆలయం వద్ద వెనక్కి మళ్ళిన సముద్రం



సముద్రం వెనక్కి మళ్లడం చూస్తున్న భక్తులు

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయం వద్ద సముద్రం రెండో రోజూ వెనక్కి మళ్ళింది. ఈ ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు వచ్చేస్తుంటారు. అలా వచ్చే భక్తులంతా ఆలయం సమీపంలో ఉన్న సముద్రతీరంలో స్నానం చేసి, నాళికినరు వద్ద పవిత్ర జలాలను శిరస్సుపై చల్లుకుని స్వామివారి దర్శనానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులు అక్కడి సముద్రం వెనక్కిమళ్లుతోంది. బుధవారం ఉదయం సముద్రతీరం 50 అడుగుల మేర వెనక్కి మళ్ళింది. అమావాస్య సందర్భంగా పెరిగే ఆటుపోటుల ప్రభావం వల్ల సముద్రం వెనక్కి మళ్ళినట్లు అధికారులు చెప్పారు. ఈ పరిస్థితులలో గురువారం ఉదయం కూడా మళ్ళీ సముద్రం వెనక్కి వెళ్లింది. ఫలితంగా ఆలయ మండపం నుండి సముద్రతీరం వరకు మెట్లపై నడిచి వేళ్లేందుకు భయపడ్డారు. సుమారు 60 అడుగుల దూరం దాకా సముద్రం వెనక్కి మళ్ళింది. దీనితో సముద్రం స్నానం చేయాలనుకున్న పర్యాటకులు భక్తులు భీతిల్లారు. అలల తాకిడి కూడా అధికమైంది.

అలంగానల్లూరులో ముమ్మరంగా బెల్లం తయారీ



చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా అలంగానల్లూరు తమిళుల సాహసక్రీడ జల్లికట్టుకు మాత్రమే కాదు, బెల్లం తయారీలోనే అంతర్జాతీయ స్థాయిలో పేరుంది.. అలంగానల్లూరు సమీపం సెంబుకుడిపట్టి, అయ్యన్‌గౌండన్‌పట్టి, వలసై, కొండయంపట్టి, కల్లసై, సంబకుళం తదితర గ్రామాల్లో రైతులు చక్కెర తయారీ కర్మాగారాల కోసం చెరకు పండిస్తున్నారు. ఈ నేపథ్యంలో పొంగల్ సందర్భంగా ఇటీవలే కటింగ్ చేసిన చెరకుతో నాటుబెల్లం తయారీని రైతులు ప్రారంభించారు. సంక్రాంతి వచ్చిందంటేనే ప్రతిఇంటా బెల్లంతో తయారైన పొంగలిని సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు.. ఆ మేరకు రాష్ట్రమంతటా బెల్లం అమ్మకాలు జోరుగా పెరుగుతాయి. రాష్ట్రంలో ఎన్నో చోట్ల బెల్లం తయారవుతున్నప్పటికీ అలంగానల్లూరులో తయారయ్యే బెల్లం రుచిలో, శుభ్రతలో అగ్రస్థానంలో ఉంటుంది. ప్రస్తుతం సంక్రాంతికి ఇంకా పది రోజులే ఉండటంతో ఆ ప్రాంతంలో రోజుకు 500 కేజీల చొప్పున బెల్లం తయారవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ బెల్లం ధర రూ.60 నుండి రూ.65ల వరకు ఉంది.

సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ఆటకట్టు

● విదేశాల నుంచే దోపిడీని అడ్డుకున్న వైనం



ఇంట్లో ప్రవేశిస్తున్న దొంగలు

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కోయిల్ సమీపంలో ఇంటి తాళాలు పగులగొట్టి దోపిడీ చేసే ఘటనను విదేశాల నుంచి సీసీటీవీలో చూసి ఇంటి యజమాని, దోపిడీ దొంగలను తరిమిన వైనం గ్రామస్తులను ఆశ్చర్యపరిచింది. కన్నియాకుమారి జిల్లా కోట్టార్ ప్రాంతానికి చెందిన సలీమ్, మస్కట్‌లో పనిచేస్తున్నారు. కాగా కోట్టార్‌లోని తన ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి అక్కడి నుంచే పర్యవేక్షిస్తుంటాడు. ఈ క్రమంలో, ఇంట్లో ఎవరూ లేరని గుర్తించిన ఇద్దరు వ్యక్తులు, మంగళవారం రాత్రి తలుపులు పగులగొట్టి ఇంట్లో చొరబడి బీరువా బద్దలు కొట్టేందుకు యత్నిస్తున్నారు. ఈ దృశ్యాలను మస్కట్‌లో ఉంటున్న సలీమ్, తన సెల్‌ఫోన్ ద్వారా చూశాడు. ఆయన వెంటనే పక్కింటి వారికి ఫోన్ చేసి, తన ఇంట్లో దొంగలు పడినట్లు తెలిపారు. వారు బయటకు వచ్చి 'దొంగ...దొంగ' అంటూ కేకలు వేశారు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొనేలోపు, దొంగలు ఇంటి వెనుక తలుపు ద్వారా తప్పించుకు పారిపోయారు. ఈ ఘటనపై సలీమ్ కోట్టార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం సలీమ్ స్వగ్రామానికి రానున్న నేపథ్యంలో, ఈ ఘటనలో ఏ వస్తువులైనా దొంగిలించారా? అనే విషయం తెలుస్తుందని పోలీసులు తెలిపారు.

ఇంటి తాళం పగులగొట్టి నగలు చోరీ

వాషర్‌మెన్‌పేట, జనవరి 2(ఆంధ్రజ్యోతి): సేలైయార్‌లోని మాడంబాక్కంలో టెల్లస్ అవెన్యూ వీధిలో మంగళవారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు నగలు దొంగిలించారు. వివరాల్లోకి వెళ్తే.. మాడంబాక్కంలో విఘ్నేష్ (37) కుటుంబంతో కలిసి తిరుపతికి వెళ్లి బుధవారం ఉదయం తిరుగొచ్చిన వారు తమ ఇంటి తాళం పగులగొట్టివుండటాన్ని చూసి దిగ్భ్రాంతికి గురైయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరో వారి ఇంట్లోని సుమారు 16 సవర్ల బంగారు నగలు,వినాయకుడి వెండి విగ్రహం, తదితర విలువైన వస్తువులను దొంగిలించారు. వెంటనే విఘ్నేష్ ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అయ్యప్పన్‌తాంగళ్, కోవిలంబాక్కం ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అయ్యప్పన్‌తాంగళ్: కాట్టుపాక్కం, చంద్రపురం, శ్రీనగర్, విజయలక్ష్మి నగర్, జానకిఅమ్మాళ్ నగర్, స్వర్ణపురి నగర్, అడిషన్ నగర్, శ్రీనివాసపురం, కృష్ణా నగర్, మారుతి నగర్, నోంబల్, మౌంట్ పూందమల్లి రోడ్డు, ఆయిల్ మిల్ రోడ్డు, హడ్కో నగర్, అయ్యప్పన్‌తాంగళ్, సుబ్బయ్యనగర్, కృష్ణావేణి అమ్మాళ్ నగర్, వసంతం నగర్, శివరామకృష్ణ నగర్, విజయలక్ష్మి అవెన్యూ

కోవిలంబాక్కం: రాఘవ నగర్ (ఎస్.కొళత్తూర్ మెయిన్ రోడ్డు), పాల్వాడి, మేడవాక్కం మెయిన్ రోడ్డు, కడప్పాగల్, వైద్యలింగం నగర్, రాజీవ్ నగర్ 6వ వీధి, అపోలో హాస్టల్, శ్రీరామ్ ప్లాట్స్, ఏఆర్ఆర్ ప్లాట్స్, నాంజిల్ ప్లాట్స్, దినకరన్ వీధి, మణియమ్మ వీధి, వెల్లక్కల్ బస్టాండ్, కన్నదాసన్ వీధి, అన్నా వీధి, భారతి వీధి, గాంధీ వీధి, పొన్నియమ్మన్ కాలడి 1 నుంచి 5 వీధులు, కలైంజర్ నగర్, వీరపాండి నగర్ 1 నుంచి 10 వీధులు, రాణి నగర్, అంబేడ్కర్ వీధి, ముత్తయ్య నగర్, వివేకానందర్ వీధి, రాజీవ్ గాంధీ నగర్, పెరుమాళ్ నగర్, కరునైశేఖరన్ నగర్, ఏలుమలై సాలై మెయిన్ రోడ్డు, ఏలుమలై సాలై 1 నుంచి 7 వీధులు, వడికాల్ నగర్ 1 నుంచి 3 వీధులు, గోపాల్ నగర్ 1 నుంచి 3 వీధులు, రాజీవ్ నగర్ 3 నుంచి 5 వీధులు, శ్రీపెరుమాళ్ నగర్ 1 నుంచి 3 వీధులు, ధనం అవెన్యూ 1 నుంచి 4 వీధులు, జేజే పార్క్, పార్థసారథి రోడ్డు 1 నుంచి 11 వీధులు, దుర్గా నగర్ 1 నుంచి 4 వీధులు, విఘ్నేష్ నగర్, రామ్ నగర్, జయగణేశ్ నగర్, ఆంజనేయ ఆలయం నన్మంగళం, విజయలక్ష్మి నగర్ 1,2 వీధులు, అభినందన్ నగర్ 3వ మెయిన్ రోడ్డు, అత్తికుడై 1 నుంచి 3 వీధులు, తమిళన్ వీధి, పిల్లయార్ ఆలయ వీధి, బాలకృష్ణ వీధి, బలరామన్ వీధి, రఘుపతి వీధి, అవియా ఎన్‌క్లేవ్ 1 నుంచి 3 వీధులు.

రాష్ట్రంలోనే ఆస్తిపన్ను తక్కువ

● మేయర్ ప్రియ

అడయార్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పొరుగు రాష్ట్రాలైన కేరళ, ఆంధ్రప్రదేశ్ తో పాటు ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే ఆస్తి పన్ను మన రాష్ట్రంలోనే తక్కువగా ఉందని నగర మేయర్ ఆర్.ప్రియ తెలిపారు. గురువారం చెన్నై కార్పొరేషన్ 44వ వార్డులో రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబుతో కలిసి ఆమె ఇంటింటికి వెళ్ళి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, చెన్నై నగర పాలక సంస్థలో గత పదేళ్లలో ఆస్తి పన్నును పెంచలేదని గుర్తు చేశారు. 2022లో అతి తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను పెంచడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఉత్తరాది రాష్ట్రాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన కేరళ, ఆంధ్రప్రదేశ్‌తో పోల్చితే మన రాష్ట్రంలోనే ఆస్తిపన్ను తక్కువగా ఉందన్నారు. నవంబరు, డిసెంబరు నెలల్లో కురిసిన భారీ వర్షాలకు నగర రహదారులు బాగా దెబ్బతిన్నాయన్నారు. ఈ రోడ్లపై ప్యాచ్ వర్క్‌లు సాగుతున్నాయని చెప్పారు. మరమ్మతులు చేయలేని రహదారులను మాత్రం కొత్తగా వేస్తున్నామన్నారు.

స్మార్ట్ మీటర్ల టెండర్ల రద్దుతో రూ.9 వేల కోట్లు కోల్పోయే అవకాశం?!

పెరంబూర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల టెండర్ల రద్దుతో రూ.9 వేల కోట్లు కోల్పోనుండగా, మరో రూ.20 వేల కోట్ల రుణాలు పొందడంలో చిక్కులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయాలని కేంద్ర ప్రభుత్వం సూచనలు, మార్గదర్శకాలతో రాష్ట్ర విద్యుత్ బోర్డు చర్యలు చేపట్టింది. తొలివిడతగా 82 లక్షల స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించింది. ఈ టెండర్లలో అదానీ గ్రూప్‌నకు చెందిన అదానీ ఎనర్జీ సొల్యూషన్ తక్కువ ధర కోడ్ చేసి టెండర్లు దక్కించుకుంది. అనంతరం అదానీ సంస్థ అధికారులకు లంచాలు అందించిందనే ఆరోపణలు తలెత్తాయి. అలాగే, సింగిల్ ఫేస్ మీటరు ఏర్పాటు, పర్యవేక్షణకు రూ.120, త్రీ ఫేస్ మీటరు ఏర్పాటు, పర్యవేక్షణకు రూ.169 అని అదానీ సంస్థ టెండర్‌లో కోడ్ చేసింది. అనంతరం జరిపిన చర్చల కారణంగా వరుసగా రూ.96, రూ.139కి తగ్గించారు. అదే సమయంలో, పుదుచ్చేరిలో ఈ రుసుము రూ.70, రూ.120గా ఉంది. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఈ ధర కూడా అధికంగా ఉందనే ఆరోపణలతో, స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు అదానీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని విద్యుత్ బోర్డు రద్దు చేసింది. తాజాగా, మార్చిలోపు కొత్త టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపనులు ప్రారంభించాలని విద్యుత్ బోర్డు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ పునర్నిర్మాణ పథకంలో రాష్ట్రానికి రూ.9,000 కోట్లు కేటాయించింది. తాజాగా ఈ నిధులు కేంద్రం వెనక్కి తీసుకొనే అవకాశముంది. అదే సమయంలో రాష్ట్ర విద్యుదుత్పత్తి సామర్థ్యం అంచనా వ్యయంలో 0.5 శాతం రుణంగా పొందే అవకాశముంది. ఆ ప్రకారం, రూ.20 వేల కోట్లు రుణం పొందడంలో కూడా రాష్ట్ర విద్యుత్ బోర్డుకు చిక్కులు ఏర్పడుతున్నాయి.

హైకోర్టులో తిరుమాకు ఊరట

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హిందూ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ తిరుమావళవన్‌పై నమోదైన కేసును మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. 2020, సెప్టెంబరు 27వ తేది వెబినార్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, హిందూ మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారంటూ పేరయూర్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో మదురైకి చెందిన వేద పిటిషన్ వేశారు. ఈ కేసు రద్దు చేయాలని కోరుతూ తిరుమావళవన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి వేల్‌మురుగన్ విచారించగా మనుస్మృతిలో హిందు మహిళల గురించి పేర్కొన్న అంశాలనే ప్రస్తావించారే తప్ప, హిందు మహిళలకు వ్యతిరేకంగా మాట్లాడలేదని తిరుమావళవన్ తరపు న్యాయవాది వివరించారు. ఇరుతరపు వాదనల అనంతరం న్యాయమూర్తి వేల్‌మురుగన్... మనుస్మృతిలో ఉన్న అంశాలనే తిరుమావళవన్ పేర్కొన్నారని, ఆయనపై నమోదైన కేసుకు ఎలాంటి ఆధారాలు లేంటూ, ఆయనపై ఉన్న కేసు రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

6న డీఎండీకే ఆందోళన

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పొంగల్ బహుమతుల్లో రూ.1,000 నగదు చేర్చాలని కోరుతూ డీఎండీకే ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేది అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత విడుదల చేసిన ప్రకటనలో.. పొంగల్ పండుగను ప్రతి ఒక్కరు ఆనందంగా జరుపుకోవాలనే ప్రతి ఏడాది రూ.1,000 నగదు, బహుమతులు అందజేస్తున్నారన్నారు. కానీ, రాబోయే పొంగల్‌కు కేవలం కిలో పచ్చి బియ్యం, ఒక కిలో చక్కెర, ఒక చెరకు గడ మాత్రమే ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, నగదు గురించిన ప్రస్తావన లేకపోవడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారన్నారు. పొంగల్ బహుమతుల్లో రూ.1,000 నగదు చేర్చాలని కోరుతూ ఈ నెల 6న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళన చేపట్టనున్నట్లు ప్రేమలత తెలిపారు.

మహిళపై దాడి చేసి దోపిడీ

ప్యారీస్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా మేట్టుపాళయం గ్రామంలో ఓ మహిళపై దాడిచేసిన ముసుగుదొంగలు.. దోపిడీకి పాల్పడ్డారు. బుధవారం నారాయణస్వామి అనే రైతు ఎరువుల కోసం కోవై వెళ్లగా అతడి భార్య కాళీశ్వరి ఇంట్లో ఒంటరిగా ఉంది. అర్ధరాత్రి ఇంట్లోకి ప్రవేశించిన నలుగురు దుండగులు.. కాళీశ్వరిపై దాడి చేసి, ఇంట్లో వున్న రూ.45 వేలు దోచుకెళ్లారు. వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కాళీశ్వరి గొంతు నులిమి హత్య చేసేందుకు యత్నించారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ గ్రామస్తుడు వారిని గమనించి కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకున్నారు. వారిని గమనించిన దుండగులు పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నారాయణస్వామి ఊరికెళ్లిన సమయంలోనే దోపిడీ జరగడంతో.. ఆ కుటుంబం గురించి తెలిసినవారే ఈ పనికి పాల్పడి వుంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఏనుగు దాడిలో ఒకరి మృతి

వాషర్‌మెన్‌పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా తోళంపాళయంలోని అటవీ ప్రాంతంలో ఓ వ్యక్తిపై ఏనుగు దాడి చేసింది. నిలియాంపట్టి గ్రామానికి చెందిన దేవరాజ్ తన పశువులను వెతకడానికి అటవీ ప్రాంతానికి వెళ్లాడు. ఆ సమయంలో పొన్నుస్వామి(45) అనే వ్యక్తి తలకు బలమైన గాయమై పడివున్నాడు. అది చూసిన దేవరాజ్ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మృతదేహాన్ని పరిశీలించగా, అతడి తలపై ఏనుగు కాలి ముద్రలు ఉండటంతో ఏనుగు దాడిలో మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు పోస్టుమార్టంకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారవేత్త ఇంటిలో రూ.40 లక్షల దోపిడీ

అడయార్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా పొన్నకరిలో సెక్యూరిటీగార్డుపై దాడి చేసిన దొంగలు ఓ వ్యాపారవేత్త ఇంటిలో రూ.40 లక్షలు దోపిడీ చేశారు. పొన్నకరికి చెందిన షణ్ముగం అనే వ్యక్తి కాంట్రాక్టరు ఇంటికి శ్రీరంగానికి చెందిన కామరాజ్ కాపలాగా ఉన్నారు. గత నెల 26వ తేదీన షణ్ముగం ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరైన తంజావూరు వెళ్ళారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సెక్యూరిటీ గార్డుపై దాడి చేసి, ఇంటిలోకి ప్రవేశించి రూ.40 లక్షల నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయారు. షణ్ముగం స్వస్థలం నుంచి బుధవారం ఉదయం తిరిగి ఇంటికి రాగా కామరాజ్ కాళ్ళు చేతులు కట్టేసిన స్థితిలో చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

10 మంది బైకర్లపై కేసు

అడయార్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా కోయంబేడు ప్రాంతంలో అధిక శబ్దంతో బైకులను నడిపిన పది మందిపై నగర పోలీసులు కేసులు నమోదు చేశారు. అలాగే, వీరు ఉపయోగించిన బైకులను కూడా స్వాధీనం చేసుకున్నారు. నగర వాసులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా న్యూ వేడుకలను జరుపుకోవాలని సూచిస్తూ పోలీసులు పలు ఆంక్షలను విధించారు. అయితే, పలువురు మాత్రం మంగళవారం రాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బైక్ రేస్, వీలింగ్ వంటి ప్రమాదాకర విన్యాసాలకు పాల్పడ్డారు. మరికొందరు అధిక శబ్దం వచ్చే బైకులపై చక్కర్లు కొడుతూ శబ్దకాలుష్యానికి పాల్పడటంతో పాటు పాదాచారులకు తీవ్ర అసౌకర్యానికి గురిచేశారు. ఇలాంటి వారిని గుర్తించి పోలీసులు కేసు నమోదు చేశారు.



'మద్రాస్‌కారన్'లో ఓ దృశ్యం

పొంగల్ రేస్‌లో పలు చిత్రాలు

అగ్రహీరో అజిత్ కుమార్ - త్రిష జంటగా నటించిన 'విడాముయర్చి' పొంగల్ రేస్ నుంచి తప్పుకోవడంతో అనేక చిన్న చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. 'విడాముయర్చి' విడుదలను వాయిదా వేస్తున్నట్టు లైకా ప్రొడక్షన్ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. వెంటనే పలువురు చిన్న నిర్మాతలు తమ చిత్రాలను విడుదల చేసేందుకు ముందుకు వస్తున్నారు. దర్శక నిర్మాత సుశీంద్రన్ రూపొందించిన '2కే లవ్ స్టోరీ', దివంగత విజయకాంత్ కుమారుడు షణ్ముగ పాండియన్ నటించిన 'పడైతలైవన్', జయం రవి - నిత్యా మేనన్ జంటగా నటించిన 'కాదలిక్క నేరమిల్లై' చిత్రాలు సంక్రాంతి రేస్‌లోకి వచ్చాయి. ఈ నెల 10న అరుణ్ విజయ్ - దర్శకుడు బాలా కాంబినేషన్‌లో రూపొందిన 'వణంగాన్' రిలీజ్ చేస్తున్నట్టు గతంలోనే ప్రకటించారు. అదే రోజున 'టెన్ అవర్స్', 'మద్రాస్‌కారన్' జనవరి 14న 'కాదలిక్క నేరమిల్లై' విడుదలకానున్నాయి. 'పడైతలైవన్' మూవీ రిలీజ్ తేదీపై ఇంకా స్పష్టత రాలేదు. పొంగల్ రేస్ నుంచి అజిత్ దూరం కావడంతో ఏడు చిత్రాలు విడుదలకానున్నాయి.

తమిళ చిత్రజ్యోతి

'అరణ్యకాండం' ఫేం యాస్మిన్ రీఎంట్రీ



యాస్మిన్ పొన్నప్ప

గతంలో వచ్చిన 'అరణ్యకాండం' సినిమాలో నటించి ప్రత్యేక గుర్తింపుపొందిన నటి యాస్మిన్ పొన్నప్ప. సుదీర్ఘ విరామం తర్వాత మళ్ళీ రీఎంట్రీ ఇవ్వనుంది. విదేశాల్లో సైకాలజీ అంశంపై ఉన్నత విద్య పూర్తి చేసి తిరిగొచ్చిన ఆమె... నటిగా తనను తాను మెరుగుపరుచుకునేందుకు శిక్షణ తీసుకుని రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'కెమెరా ముందు నిలబడే తరుణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. విభిన్న కథాంశాలు, వైవిధ్యభరితమైన పాత్రల్లో నటించాలని ఉవ్విళ్ళూరుతున్నాను. ఇటీవలి కాలంలో తమిళ సినిమా మరో స్థాయికి చేరుకుంది. తదనుగుణంగా నన్ను నేను మలచుకునేందుకు ప్రయత్నిస్తున్నాను. నేను నేర్చుకున్న సైకాలజీ కూడా సినిమాల్లో ఉపయోగపడే పాత్రల్లో నటించాలని ఆశపడుతున్నాను. ముఖ్యంగా కథలో నా పాత్ర ఎంత ప్రాధాన్యమైనదో గ్రహించి ఆ పాత్రలో రాణించేందుకు సిద్ధంగా ఉన్నాను' అని ఆమె పేర్కొన్నారు.

అశోక్, అను జంటగా 'లారా'

వర్థమాన్ నటుడు అశోక్ కుమార్, అనుశ్రేయ రాజన్, కార్తికేశన్, వెన్మతి మాథ్యూ వర్గీస్, వర్షిణి, బాలా, ఎస్‌కే బాబు, దిలీప్ కుమార్ తదితరులు నటించిన తాజా చిత్రం 'లారా'. ఎంకే ఫిల్మ్ మీడియా వర్క్స్ పతాకంపై కార్తికేశన్ నిర్మించారు. ఈ చిత్రానికి కథ సమకూర్చి దర్శకత్వం వహించిన మణిమూర్తి సినిమా వివరాలను వివరిస్తూ, 'ఇది మర్డర్ మిస్టరీ మూవీ. డిటెక్టివ్ స్టోరీలా సాగుతుంది. మహిళ హత్య, హవాలా మనీ, మోసం, సెక్స్ వర్కర్లు, లారా ప్రేమ కథ, ఆయుధాల తయారీ తదితర అంశాలతో ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. లారా ప్రేమకథకు - మహిళ హత్యకు గల సంబంధం ఏంటి అనేదే ఈ చిత్ర కథ. వర్ధమాన నటుడు అశోక్ కుమార్ పాత్ర నిడివి తక్కువగా ఉన్నప్పటికీ అందులో జీర్ణించారు. నిర్మాత కార్తికేశన్ పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా నటించారు. లారా పాత్రలో కనిపించిన అనుశ్రేయ రాజన్, స్టెల్లాగా వెన్మతి, జయ పాత్రలో వర్షిణి తమతమ పాత్రల్లో జీవించారు. ఎమ్మెల్యే ఫరూక్ పాత్రలో మాథ్యూ వర్గీస్ నటించారు. ఒక వైపు డిటెక్టివ్ కోణంలో సినిమా సాగుతున్నప్పటికీ కొన్ని సన్నివేశాల్లో నటీనటుల హావభావాలే ప్రేక్షకులను నవ్విస్తాయి. ఓవరాల్‌గా క్రైమ్ థ్రిల్లర్‌గా కొనసాగినప్పటికీ ఈ సినిమా ఆద్యంతం ఆసక్తికర స్క్రీన్‌ప్లేతో ప్రేక్షకుడిని ఉత్కంఠకు లోనుచేసేలా ఉంటుంది' అని దర్శకుడు వివరించారు.



'లారా'లో అశోక్ కుమార్, అనుశ్రేయ రాజన్

ఫిబ్రవరిలో 'అస్త్రం' విడుదల

నటుడు శ్యామ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'అస్త్రం' ఫిబ్రవరి 21న విడుదల చేయనున్నారు. ప్రముఖ మోడల్ నిరంజని హీరోయిన్‌గా నటించగా, నూతన దర్శకుడు అరవింద్ రాజగోపాల్ దర్శకత్వం వహించారు. ఇతనికి పదేళ్ళుగా అనేక లఘు చిత్రాలకు దర్శకత్వం వహించి, నటించిన అనుభవముంది. బెస్ట్ మూవీస్ పతాకంపై షణ్ముగమణి నిర్మించగా, ఇతర పాత్రల్లో నిళల్‌గల్ రవి, జీవా రవి, అరుల్ డి.శంకర్, రంజిత్ (తొలి పరిచయం) తదితరులు నటించారు. 'పార్కింగ్', 'మహారాజ', 'గరుడన్' వంటి హిట్ చిత్రాలను రిలీజ్ చేసిన ఫైవ్‌స్టార్ సెంథిల్ ఈ సినిమాను రాష్ట్ర వ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నారు.




'అస్త్రం'లో శ్యామ్, నిరంజని

ఆధ్యాత్మికం

కామధేనువు కొలిచిన కల్యాణ పశుపతీశ్వరాలయం

ఆదిత్యుడిని ఆశీర్వదించిన ఆదిదేవుడు

ఇద్దరమ్మలతో కొలువుదీరిన పరమేశ్వరుడు



ఆలయ అంతర ప్రాకారం

షణ్మంగళ క్షేత్రం ఆది కరువూరు

కొంగు మండలంలో ఆదికరువూరు, వెంజమాంగూడలూరు, తిరుమురుగన్ పూండి, అవినాశి, తిరుచెంగోడు, భవాని, తిరుపాండి కొడుముడి ఏడు శైవక్షేత్రాల్లో ప్రప్రథమమైది ఆది కరువూరు అనే (కరూరు) కల్యాణ పశుపతీశ్వరాలయం. ఆది కరువూరు అని ఈ క్షేత్రం పేరుగాంచడానికి కారణం పుడమికంటే ముందే ఆవిర్భవించిన ఊరు కావటమే. బ్రహ్మదేవుడు సృష్టికార్యాన్ని మొదట ప్రారంభించిన క్షేత్రంగా పేరుంది. మూర్తి, స్థలం, తీర్థం అనే మూడు ప్రత్యేకాశాల క్షేత్రంగాను భాసిల్లుతోంది. తొలుత ఆవిర్భవించినది కనుక దీనిని 'ఆదిపురం' అని, పెరుమాళ్ శయనించిన క్షేత్రం గనుక 'భాస్కరపురం' అని, చోళుల కాలంలో 'వీరచోళపురం' అని పిలుస్తుంటారు. పర్వతం, అరణ్యం, వాగు, తీర్థం, నగరం, ఆలయం అంటూ ఆరు మంగళాంశాలు కలిగిన క్షేత్రం కనుక 'షణ్మంగళ క్షేత్రం' అని, కామధేనువు పరమశివుడిని ఆరాధించిన క్షేత్రం కనుక స్వామివారిని 'పసుపతీశ్వరుడు' అని పిలుస్తారు. ఇక బ్రహ్మదేవుడు ఈ క్షేత్రంలో సరస్వతీదేవిని పరిణయమాడినందున్న స్వామివారిని 'కల్యాణ పశుపతీశ్వరుడు' అని కూడా పిలుస్తున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



స్థలపురాణం...

పూర్వం బ్రహ్మదేవుడు తానే ఆదికర్తననే గర్వంతో విర్రవీగుతుండేవాడు. తాను సృష్టికార్యం చేయకపోతే మహావిష్ణువు, పరమేశ్వరుడు అచేతనంగా మిగిలిపోతారని భావించేవాడు. బ్రహ్మదేవుడి గర్వమణచాలని మహావిష్ణువు నిర్ణయించారు. ఆ మేరకు బ్రహ్మదేవుడు సృష్టి కార్యాన్ని ప్రారంభించినప్పుడు ఏ జీవరాశి పుట్టలేదు. దీంతో బ్రహ్మదేవుడి గర్వం అణిగింది. ఆలోగా పరమశివుడు కైలాసంలోని కామధేనువును భూలోకానికి పంపి సృష్టికార్యం నిర్వహించమన్నాడు. జరిగినదంతా తెలుసుకుని బ్రహ్మదేవుడు కుమిలిపోయాడు. పరమేశ్వరుడి అనుగ్రహం కోసం తపమాచరించాడు. పరమశివుడు ప్రత్యక్షమై వంజివనంగా పిలిచే కరువూరు క్షేత్రానికి వెళ్ళి మహాయాగం చేసి అక్కడే సరస్వతీ దేవిని పరిణయమాడమని ఆదేశిస్తారు. శివాజ్ఞ మేరకు బ్రహ్మదేవుడు ఆ క్షేత్రానికి వెళ్ళి ఓ తీర్థాన్ని సృష్టించి మహాయాగం జరిపి సరస్వతీదేవిని ఆ క్షేత్రంలోనే పరిణయమాడాడు. అక్కడే పరమేశ్వరుడి కోసం అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాడు. ఆలయానికి ఈశాన్య దిశగా కాళికాలయం, అయ్యనార్‌కోవిల్ నిర్మించాడు. మేరుపర్వతాన్ని తలపించే మహారథాన్ని కూడా బ్రహ్మదేవుడు సృష్టించాడు. ముల్లోకాలకు చెందిన వారినందరినీ ఆహ్వానించి ఆలయంలో పంగుణి ఉత్తిర వేడుకలను జరిపించి తన బ్రహ్మలోకం చేరుకుని సృష్టి కార్యాన్ని ప్రారంభించాడు. ఇక తాత్కాలికంగా భూలోకానికి వచ్చి సృష్టికార్యం నిర్వహించిన కామధేనువు ఈ క్షేత్రానికి వచ్చి ఓ వల్మీకంలో ఉన్న ఆదిలింగంపై పాలన స్రవింపజేసి ఆరాధించసాగింది. ఓ రోజు తన కాలిగిట్ట పొరపాటున ఆ శివలింగం శిరోభాగాన్ని తాకటం అక్కడ రక్తం స్రవించడం చూసి భీతిల్లింది. పరమేశ్వరుడు ప్రత్యక్షమై అదంతా తన లీలావిశేషమని చెప్పి ఓదార్చారు. ఇకపై ఆ క్షేత్రంలో స్వయంభు లింగంగా వెలసిన తనను పసుపతీశ్వరుడని భక్తులందరూ కొలుస్తారని వరమిచ్చారు. ఆ ప్రకారమే ఈ ఆలయంలో కృపానాయకి సమేతుడై పసుపతీశ్వరనాథుడు భక్తులను అనుగ్రహిస్తున్నారు. తూర్పు వైపు సన్నిధిలో శ్రీచక్ర సమేతంగా అమ్మవారు పూజందుకుంటున్నారు.



సౌందర్యనాయకి అమ్మవారి సన్నిధి



విశేషాలంకరణలతో పసుపతీశ్వరుడు



ఆదిదంపతుల కల్యాణోత్సవం

ఆలయవైభవం...

ఆలయ రాజగోపురం ఏడంతస్తులతో 108 అడుగుల ఎత్తుతో చోళుల కాలం నాటి శిల్పసంపదతో దర్శనమిస్తుంది. ఆ గోపురం అంతటా పరమేశ్వరుడి లీలావిశేషాలు, దశావతార సంఘటనలకు సంబంధించి శిల్పాలున్నాయి. పంగుణి నెల 14, 15, 16 తేదీల్లో సూర్యకిరణాలు పరమేశ్వరుడి పాదాలపై పడతాయి. ఈ సూర్య పూజోత్సవాలను తిలకించడానికి దేశం నలుమూలల నుండి భక్తులు తరలి వస్తారు. రాజగోపురాన్ని దాటి వెళ్తే ఐదంతస్తులతో మరో గోపురం దర్శనమిస్తుంది. ఈ రెండు గోపురాల మధ్యలో ఎత్తయిన దీప స్తంభం కూడా ఉంది. ఇక దక్షిణాభిముఖంగా విఘ్నేశ్వరుడు, తూర్పువైపు 12 మంది నాగదేవతలున్నారు. ఈ ఆలయంలో అలంకారవళ్ళి అనే పేరుతో కృపానాయకి అమ్మవారు, వడివుడైయాల్ అమ్మవారు వేర్వేరు సన్నిధుల్లో పూజలందుకుంటున్నారు. దక్షిణదిశగా సౌందర్యనాయకి అనే పేరుతో వడివుడై అమ్మవారు దర్శనమిస్తున్నారు. దాని వెనుకే శివుడి శయనమందిరం ఉంది. ఇద్దరమ్మల ఎదుట నందివిగ్రహాలున్నాయి. ఆలయంలోని మూలవిరాట్టు ఎదురుగా తూర్పు వైపు ధ్వజస్తంభం, బలిపీఠం, నందిదేవుడి తిరుమేని ఉన్నాయి. మూలవర్లున్న గర్భాలయం చుట్టూ నర్తన గణపతి, తెన్‌ముగ కడవుల్, అర్ధనారీశ్వరు, బ్రహ్మదేవుడు, దుర్గాపరమేశ్వరి సన్నిధులున్నాయి. నవగ్రహాలు, భైరవుడికి కూడా ఆలయలులున్నాయి.



మూలవిరాట్టు, గర్భాలయ ప్రవేశద్వారం

ఆలయ విశేషాలు..

ఈ ఆలయంలో ప్రతియేటా పంగుణి ఉత్తిరం ఉత్సవాలు 13 రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఇదే విధంగా మార్గళి పూజలు, ఆరుద్ర దర్శన వేడుకలు 13 రోజులుపాటు నిర్వహిస్తారు. మహా శివరాత్రి, సూర్యపూజోత్సవాలు ఘనంగా జరుగుతాయి.



కాళికాంబాళ్ సన్నిధి

ఆలయానికి చేరుకునే మార్గాలు ...

రాజధాని నగరం చెన్నై సహా పలు నగరాల నుండి కరూరుకు వెళ్లటానికి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులున్నాయి. చెన్నై నుంచి రైలులోనూ ఆ నగరానికి చేరుకోవచ్చు. కరూరు బస్టాండు, రైల్వేస్టేషన్‌లో దిగి ఆటో, టాక్సీలో పశుపతీశ్వరాలయాన్ని చేరుకోవచ్చు. ప్రతిరోజూ రోజూ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుండి 8 గంటల వరకూ ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

నెమ్మెళి పార్కులో పూల సోయగం


స్థానిక క్యాథిడ్రల్ రోడ్డులో వున్న సెమ్మొళి పార్కులో పుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ప్రారంభించారు. నగరంలో తొలి పుష్ప ప్రదర్శన కలైవానర్ ఆడిటోరియంలో 2022 జూన్ 3 నుంచి 5వ తేది వరకు మూడు రోజులు నిర్వహించగా, 44,888 మంది ప్రజలు వీక్షించారు. 2023 జూన్ 3 నుంచి 5వ తేది వరకు నిర్వహించిన రెండో పుష్ప ప్రదర్శనను 23,302 మంది తిలకించారు. ఈ పదర్శనలో స్వదేశీ, విదేశాలకు చెందిన పూలు, కూరగాయలు చోటుచేసుకున్నాయి. మూడవ ప్రదర్శన సెమ్మొళి పార్క్‌లో 2024 ఫిబ్రవరి 10 నుంచి 20వ తేది వరకు 11 రోజుల పాటు సాగింది. కలైంజర్ సెంటినరీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో రకరకాల పూజలు, అందమైన మొక్కలు చేసుకున్నాయి. ఈ ప్రదర్శనను 1,09,027 మంది వీక్షించారు.


- చెన్నై,ఆంధ్రజ్యోతి













ప్రదర్శనలో చోటు చేసుకున్న పుష్పాలంకరణ



పార్థసారథి ఆలయంలో ఏకాదశి వేడుకలు

వాషర్‌మెన్‌పేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10వ తేదీ వైకుంఠ ఏకాదశి సందర్భంగా ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామి ఆలయంలో గత నెల 31న స్వామివారికి ఏకాదశి వేడుకలు ప్రారంభమైయ్యాయి. గురువారం తెల్లవారుజామున 6.15 గంటలకు రుక్మిణి సమేత పార్థసారథి స్వామి వారికి బంగారు ఆభరణాలతో అలంకరించారు. 10వ తేదీ ఏకాదశి రోజున ఆలయంలో ఎలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు.

ట్రిప్లికేన్‌లోని పార్థసారథి స్వామి ఆలయం



మీడియా సమావేశంలో నిర్వాహకులు

రేపటి నుంచి 'ఎస్కాన్'

చెన్నై, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో 'యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ స్కూల్ కాంక్లేవ్ (ఎస్కాన్) జరుగనుంది. రెండు రోజుల పాటు 'సీక్ యువర్ పర్సన్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో రాష్ట్రం నలుమూలల నుంచి 2500 మందికి పైగా 'ఎస్' సభ్యులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. ఈ వివరాలను గురువారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్కాన్ చైర్మన్ వి.నీతిమోహన్, కన్వీనర్ ఎ.నటేశన్, వైస్‌చైర్మన్ ఎ.రాజ్‌కుమార్, కో-కన్వీనర్ ఎస్.మురుగేశన్ తదితరులు వెల్లడించారు. ఈ ప్రదర్శనలో 270 స్టాళ్లు ఏర్పాటు చేస్తామని, సాధారణ ప్రజలు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ ప్రదర్శనకు తమిళనాడు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.జగదీశన్, ఎయిర్‌సెల్ వ్యవస్థాపకుడు సి.శివశంకరన్, రచయిత భారతి భాస్కర్, జీఆర్‌టీ గ్రూపు ఎండీ జీఆర్ అనంత పద్మనాభన్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.



కాలినడకన తిరుమలకు
నటి రాశి సింగ్

ప్రసన్న వదనం, భూతద్దం భాస్కర్ నారాయణ, ప్రేమ్‌కుమార్, పోస్టర్ వంటి చిత్రాల్లో నటించిన నటి రాశి సింగ్ గురువారం కాలినడకన తిరుమలకు వచ్చారు. శ్రీవారిమెట్టు మార్గం ద్వారా ఆమె సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సేవలో సినీ హాస్యనటులు

తిరుమల,జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం సినీ హాస్యనటులు సత్య, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం రాజేష్ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో దర్శించుకున్నారు. వీరికి ఆలయ సిబ్బంది లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం నటుడు శ్రీనివాస్‌రెడ్డి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల పొందేందుకు తిరుమలకు వచ్చామన్నారు. తర్వాత సత్యం రాజేష్ మాట్లాడుతూ తాను నటించిన రెండు సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. 'పొలిమేర' నూతన చిత్రం షూటింగ్ రెండుమూడు నెలల్లో ప్రారంభంకానుందన్నారు. వీరికి చూడటానికి అభిమానులు పోటీపడ్డారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఉత్సాహం చూపారు.

సత్య, సత్యం రాజేష్, శ్రీనివాస్‌రెడ్డి →




శ్రీహరి సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 13 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.13 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69,630

తలనీలాలు సమర్పించినవారు : 18,965





ఆరోగ్యమే మహా భాగ్యమంటారు. ప్రస్తుత జీవన విధానంలో దీనికి మరింత ప్రాముఖ్యత పెరిగింది. ఆహారం నుంచి జీవనశైలి వరకూ అన్నీ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వయసుతో సంబంధం లేకుండా అనారోగ్యం బారినపడుతున్నారు. యుక్త వయసులో ఉన్నవారూ గుండెపోటుతో కుప్పకూలుతున్న వైనాలు చూస్తున్నాం. మధుమేహం,బీపీ సరేసరి. ప్రతినెలా ఆస్పత్రి లేదా మందుల షాపు చుట్టూ తిరుగుతున్నవారే అధికం. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయంలో జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యం దరిచేరదంటున్నారు వైద్య నిపుణులు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



ఆరోగ్యమే ఆనందం

ఆరోగ్య పరీక్షలు ముఖ్యం



ప్రస్తుతం బీపీ, షుగర్ ఎక్కువ మందిలో కనిపిస్తున్న వ్యాధులు. వీటితోపాటు గుండె, మహిళలకు గైనిక్ సమస్యలు కూడా పెరుగుతున్నాయి. వయసుతో సంబంధం లేకుండా ఎక్కువ మందిలో షుగర్ వ్యాధి లక్షణాలు కలవరపరుస్తున్నాయి. అందరూ ఆహారంపై శ్రద్ధ పెట్టాలి. పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. క్రమం తప్పక ఆరు నెలలకు ఒకసారైనా డాక్టర్ దగ్గరకు వెళ్లి షుగర్, బీపీ, గుండె సంబంధిత సమస్యలకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి. గర్భవతులు ప్రతీ నెలా తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి. వ్యాయామం చేయాలి. అనవసరపు ఒత్తిళ్లకు, ఆలోచనలకు దూరంగా ఉండాలి. మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ కృష్ణప్రశాంతి, సీనియర్ కన్సల్టెంట్ ఫిజిషియన్



అనారోగ్యానికి యోగాతో చెక్

రోజూ యోగా చేస్తే సాధారణ, దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడరు. యోగాతోపాటు సులువుగా జీర్ణమయ్యే మిత ఆహారాన్ని, ఎక్కువ శాతం నీటిని తీసుకోవాలి. చిన్నవయసు నుంచే యోగాను అలవాటు చేయడం వలన ఆరోగ్యంగా ఎదుగుతారు. దేవాలయాలకు వెళ్తే అక్కడ మనం చేసే స్వామి వారికి నమస్కారం నుంచి ప్రదక్షిణల వరకు ప్రతీది యోగాలో భాగమే.

- డాక్టర్ నానబాల జగదేక ప్రతాప్, యోగా నిపుణుడు

ఆహారంతోనే ఆరోగ్యం

ఆరోగ్యం ఆహారంలోనే ఉంటుంది. బయట ఆహారం, జంక్ ఫుడ్స్ తీసుకోవడం వలన వ్యాధుల బారిన పడుతున్నారు. అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవడం ఉత్తమం. పచ్చదనంతో నిండిన కూరగాయాలు చక్కటి ఆరోగ్యాన్ని ఇస్తాయి. పిల్లలకు పానీపూరీలు, చాట్‌లు, బయట హోటళ్లలోని ఫుడ్ పెట్టకూడదు. రంగులు కలిపిన ఆహారాన్ని తినకూడదు. ఇంట్లో చేసిన ఆహారాన్ని మాత్రమే పెట్టడం మేలు. ఇంట్లో చేసుకునే పిండి వంటలు ఆరోగ్యానికి దోహదపడతాయి. మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. పాలు, గుడ్లు, చేపలు వంటి వాటివి ఎక్కువగా తీసుకుంటే మంచిది.

- ప్రసాద్, డైటీషియన్, రుయాస్పత్రి



పందెం కోళ్లను బరిలోకి దింపేందుకు సై అంటున్నారు కొందరు. మరో పది రోజుల్లో పండుగలు మొదలు కానుండటంతో.. ఇప్పటికే చాలావరకు కోళ్లను జిల్లాకు తీసుకొచ్చారు. వీటికి పౌష్టికాహారం అందిస్తున్నారు. కోళ్ల పందేలపై నిషేధమున్నా.. పోలీసులు హెచ్చరికలు చేస్తున్నా.. ఎక్కడికక్కడ గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించేందుకు బరులు సిద్ధమవుతున్నాయి.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



పందేనికి సై

కోళ్ల రకం, రంగును బట్టి రూ.2 లక్షల వరకు పలుకుతున్న ధర

సంక్రాంతి సీజన్‌తో పెరిగిన డిమాండ్

సంక్రాంతికి పట్టణాలు, పల్లెలు సిద్ధమవుతున్నాయి. చాటుమాటుగా కోడి పందేల నిర్వహణకూ పలువురు సన్నద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పలు రకాల కోళ్లకు డిమాండు పెరిగింది. పందేలకు అవసరమైన కోడి పుంజులకు మూడు నెలల నుంచి తమిళనాడు, పలమనేరు, ఊత్తుకోట, చెన్నై, ఏకాంబరకుప్పం, నారాయణవనం వంటి ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించారు కూడా. కోడి పందేలు ఎక్కడా నిర్వహించకూడదని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నా.. చాలాచోట్ల నిర్వాహకులు మాత్రం బరులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లాకు దాదాపు 20 వేల వరకు పందెం కోళ్ల కోళ్ల తీసుకొచ్చినట్లు చెబుతున్నారు. కోళ్ల జాతి రకం, రంగును బట్టి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ధర పలుకుతున్నట్లు తెలిసింది. ఇప్పటికే తీసుకొచ్చిన ఈ కోళ్లను కొందరు అతిజాగ్రత్తగా చూసుకొంటున్నారు. కోళ్లకు పెరిగిన డిమాండు నేపథ్యంలో కొందరు వీటిని తీసుకొచ్చి విక్రయించడం పనిగా పెట్టుకున్నారు. దీనికి సోషల్ మీడియాను వాడుకుంటున్నట్లు తెలిసింది. తమ వద్దనున్న పందెం కోళ్ల వివరాలను కొందరు ఫేస్‌బుక్, వాట్సాప్‌లో పెట్టి వాటి వయస్సు, ఎన్ని పందేలు గెలిచిందనే వివరాలను అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నారు. ఈ విధంగా విక్రయించిన వాటిని పార్శిల్ చేయడానికి కూడా ఒక రేటు ఫిక్స్ చేసి బస్సులు, ఆటోలు, వ్యాన్లలో పంపిస్తున్నారు. అక్కడి వారు ఫోన్ ద్వారా సంప్రదించి ఎక్కడకు ఏ సమయానికి కోళ్లు చేరుకుంటాయనేది తెలుసుకుని రిసీవ్ చేసుకుంటున్నారు. ఇలా మొత్తం వ్యవహారం ఆన్‌లైన్ ద్వారానే సాగిపోతోందని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

డిమాండున్న కోళ్లు

పందెం కోళ్లలో అత్యధికంగా కోడి నెమలి, అబ్రాస్, రసంగి, ఎర్ర డేగ, కక్కెర వంటి రకాలకు మంచి డిమాండ్ ఉంది. సైజు, రంగు, జాతిని బట్టి వీటిని దాదాపు రూ.2 లక్షల వరకు విక్రయిస్తున్నారు.

ఆఫర్లతో ఆకర్షణ

కోడి పందేల్లో ఇటీవల ఆఫర్లూ ప్రకటిస్తున్నారు. వరుసగా ఐదు పందేలు నెగ్గితే ద్విచక్ర వాహనం ఇస్తున్నారు. గత ఏడాది వరుసగా పందెం కొట్టి వాహనాలు గెలుచుకున్న వారు ఉన్నారని సమాచారం. ఫలితంగా నిర్వాహకుల మధ్య గట్టి పోటీ ఏర్పడింది.

నాదనీరాజనం కార్యక్రమాల వేళల మార్పు



నాదనీరాజనం వేదికపై మీనాక్షి సోమసుందరం బృందం వీణవాయిద్య కచేరి

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నాదనీరాజనం వేదికపై సంగీత, నృత్య కార్యక్రమాల సమయాన్ని టీటీడీ మార్చింది. గతంలో ఈవేదికపై కార్యక్రమాలన్నీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు జరిగేవి. పారాయణాల పేరుతో వీటిని మధ్యాహ్నం 3.10 నుంచి 4.30 గంటలకు మార్చారు. ఈ సమయం కళాకారులకు ఇబ్బందిగా మారడంతో పాటు భక్తులెవ్వరు ఉండటంలేదరు. ఫలితంగా ప్రోత్సాహం కరువైంది. ఈ విషయాలను ఇటీవల 'కళతప్పిన నాదనీరాజనం' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి పాత విధానంలో సాయంత్రం 6 నుంచి 7 గంటలకు కార్యక్రమాల నిర్వహణను మార్చారు. గురువారం సాయంత్రం తమిళనాడుకు చెందిన మీనాక్షి సోమసుందరం బృందం నాదనీరాజనం వేదికపై వీణ వాయిద్య కచేరి భక్తులను ఆకట్టుకుంది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

కేజీబీవీ ట్రైనర్లకు శిక్షణ ప్రారంభం

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): 'టీచింగ్ అనేది వృత్తి కాదని, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకత్వం చేసే బాధ్యత' అని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోని మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం విజయవాడలోని లయోలా కాలేజీలో ఆయన ప్రారంభించారు. కేజీబీవీ టీచర్లు బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని, బాలికలకు భద్రత, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తారన్నారు. ఈ శిక్షణా సదస్సు నుంచి మెరుగైన బోధనా విధానాలు నేర్చుకుని, కేజీబీవీల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస్

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

షార్ ఎంఎస్‌ఏ డీడీగా గోపీకృష్ణ

సూళ్లూరుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ ఏరియా (ఎంఎస్‌ఏ) డీడీగా గోపీకృష్ణ నియమితులయ్యారు. ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్ ఉన్న ఈయన్ను పదోన్నతిపై డీడీగా నియమించారు. అదేవిధంగా షార్‌లో సాలిడ్ మోటారు ప్రిపరేషన్, ఎన్విరాన్‌మెంటల్ టెస్టింగ్ ఫెసిలిటీ (ఎస్‌ఎంటీఈటీఎఫ్) డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ శంకరన్‌ను వాల్ఫ్ (వీఏఎల్‌ఎఫ్) డీడీగా నియమించారు. ఈ మేరకు బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిసింది. వీరు మరో నాలుగు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

నేదురుమల్లి సహా వైసీపీ నేతలపై కేసు నమోదు

వెంకటగిరి/వెంకటగిరిటౌన్, జనవరి 2: (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో గత నెల 27వ తేదీన వైసీపీ నిర్వహించిన పోరుబాట కార్యక్రమంలో తనపై కొంతమంది ఆ పార్టీ నాయకులు దౌర్జన్యం చేశారంటూ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సీసీ నాయుడు గత నెల 31న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వెంకటగిరి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డితో పాటు ఆ పార్టీకి చెందిన అల్లం సాయి, అల్లం సుబ్బు, ఏవీ నాగార్జున, నర్రావుల వేణుగోపాల్ నాయుడు, చింతల శ్రీనివాసులు రెడ్డి, ముప్పాళ్ల మునికృష్ణ, ఎం.శ్రీనివాసులు, మస్తాన్ రెడ్డి, నాగేంద్ర, కోమల వెంకటయ్య, బత్తల సాయిలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, తమపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ కేసులపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

● 1200 ఉద్యోగాల భర్తీకి సన్నాహాలు పూర్తి

నేడు నారావారిపల్లెలో మెగా జాబ్ మేళా



జాబ్ మేళాలో అభ్యర్థుల కోసం కుర్చీల ఏర్పాటు

చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఇందులో 1200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఆన్‌లైన్ ద్వారా 1800 మంది దరఖాస్తు చేసుకొన్నట్లు అధికారులు తెలిపారు. ఆఫ్‌లైన్ ద్వారా కూడా నిరుద్యోగులు వచ్చే అవకాశాలు ఉందన్నారు. టీటీడీ కల్యాణ మండపంలో జాబ్‌మేళా జరుగుతుంది. ఎమ్మెల్యే పులివర్తి నాని సూచనలతో డీపీవో సుశీలాదేవి పర్యవేక్షణలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం ఏర్పాట్లు చేశారు. 20 కౌంటర్లలో అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. విజయవాడ, హైదరాబాదు, చెన్నై, బెంగళూరులకు చెందిన ఐటీ, బీపీవో కంపెనీలు, శ్రీసిటీ, గాజులమడ్యం, రేణిగుంట ఈఎంసీ, నాయుడుపేట ఎస్‌ఈజడ్ నుంచి పరిశ్రమల మొత్తం 20 కంపెనీల ప్రతినిధులు రానున్నారు. మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. అనుకున్న లక్ష్యాన్ని దాటి అదనంగా 500 మందిని ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు వారు చెప్పారు.

మద్యం తాగి తిరుమలకు వచ్చిన
ఇద్దరు డ్రైవర్ల అరెస్ట్



తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తిరుమలకు మద్యం సేవించిన వచ్చిన ఇద్దరు డ్రైవర్లను ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. న్యూయర్ సందర్భంగా ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, సిబ్బంది బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు తిరుమలలోని జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహించారు. అతివేగంగా వస్తున్న రెండు వాహనాలను నిలిపి డ్రైవర్లు శేఖర్, శంకర్‌ను బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీ చేశారు. వారు మద్యం తాగి వచ్చినట్టు నిర్ధారణ అయింది. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వాహనాలను తిరుమలకు శాశ్వతంగా రాకుండా సీజ్ చేశారు. మద్యం తాగి తిరుమలకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

గో ఆధార్ మజల్స్ యాప్ ప్రారంభం



చంద్రగిరి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో గురువారం 'గో ఆధార్ మజల్స్' యాప్‌ను జిల్లా పశుసంవర్ధనశాఖాధికారి డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా మజల్స్‌ను క్యాప్చర్ చేసి, అందులో పశువుల యజమాని పేరు, ఆధార్, సెల్‌ఫోన్ నెంబర్లను నమోదు చేయనున్నట్లు తెలిపారు. దీంతో పాడి రైతులు తమ పశువులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో డీడీ డాక్టర్ ఉమామహేశ్వరి, అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ వంశీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళం అందింది. తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమార్ ఈ విరాళాన్ని అందజేశారు. తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చెక్‌ను అందజేసి ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని కోరారు.

← కుటుంబ సభ్యులతో విరాళాన్ని అందజేస్తున్న గిరిధర్

రెవెన్యూ సదస్సులకు 329 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 2(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు గురువారం 329 అర్జీలు అందాయి. 49 గ్రామసభల్లో వచ్చిన ఈ అర్జీల్లో ఇంటి స్థలాలపై 19, అసైన్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ల్యాండ్ 8, మీసేవ గ్రీవెన్స్(రెవెన్యూ)పై 5, క్యాస్ట్ వెరిఫికేషన్ 2, రీసర్వే 29, ల్యాండ్ గ్రాబింగ్ 1, ఆర్వోఆర్‌పై 158, ఇతర విషయాలకు సంబంధించి 99 ఉన్నాయి. అందులో 155 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మిగిలిన వాటిని నిర్ణీత కాల పరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.